నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 10 జనవరి 2025 | KARIMNAGAR

# ఇగమే ఇగం

**11 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు**



అల్గునూర్ శివారులో పొగమంచు

చలి తీవ్రత మళ్లీ పెరిగింది. రెండు మూడు రోజుల నుంచి ప్రతాపం చూపుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏకంగా పదకొండు డిగ్రీలకు పడిపోగా.. గజగజా వణికిస్తున్నది. పొద్దంతా చల్లగాలులు వీస్తుండగా.. ప్రజలు ఇండ్ల నుంచి వెళ్లలేని పరిస్థితి ఉంటున్నది. కోల్‌బెల్టులో మరీ దారుణంగా ఉన్నది. గురువారం 10.6 డిగ్రీలుగా నమోదు కాగా, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సాయంత్రం వేళల్లో చలిమంట కాగుతున్నారు.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

# కేటీఆర్ అరెస్ట్‌కు రేవంత్ కుట్ర

**మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, జనవరి 9: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్ట్‌కు రేవంత్ సర్కారు కుట్ర చేస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. తప్పుడు కేసులతో అక్రమంగా అరెస్ట్ చేయాలని చూస్తే రాష్ట్రం అగ్ని గుండంగా మారుతుందని హెచ్చరించారు. గంగాధర మండలం కురిక్యాలలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్ములా-ఈ రేసులో ఎలాంటి అవినీతికి తావులేకున్నా ప్రభుత్వం అక్రమ కేసులతో వేధింపులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. కేవలం ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీలపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నిస్తున్నందున వారిపై అక్రమంగా కేసులు పెడుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశానికే రోల్‌మోడల్‌గా నిలువగా, రేవంత్‌రెడ్డి పాలనలో అధోగతి పాలవుతున్నదన్నారు. చొప్పదండి నియోజకవర్గానికి వరప్రదాయినిగా ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌ను ఎల్లంపల్లి జలాలతో నింపి పంటలకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద నియోజకవర్గంలో దాదాపు 70ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ గంగాధర సింగిల్‌విండో చైర్మన్ దూలం బాలగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, ఎండీ నజీర్, వేముల దామోదర్, ముక్కెర మల్లేశం, జోగు లక్ష్మీరాజం, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు, పొట్టల కనకయ్య, నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పుల గంగాధర్, లింగాల దుర్గయ్య, నాగారపు సత్యనారాయణ, ద్యావ మధుసూదన్‌రెడ్డి, దోమకొండ మల్లయ్య, లింగాల లింగయ్య, అజ్జు, సముద్రాల అజయ్, మామిడిపెల్లి అఖిల్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు భూమికి ఎసరు!

## బొమ్మకల్‌లో వెలుగులోకి భూ భాగోతం

- పట్టా భూమి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణ!
- ఎనిమిదేళ్ల క్రితం వరకు 'సర్వే నంబర్ 58/ఎఫ్'లో ఉన్నది 20 గుంటలే
- తర్వాత 1.32 ఎకరాలుగా మార్పు!
- అందులో ఓ నాయకుడి అనుచరుడి పేరిట 1.12 ఎకరాలు
- ఫిర్యాదులు వచ్చినా స్పందన కరువు
- అధికారుల తీరుపై ఆరోపణలు







సోమవారం ప్రజావాణిలో ఆర్డీవో మహేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న తోట కిరణ్‌కుమార్

### స్పందన శూన్యం

బొమ్మకల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 58/ఎఫ్‌లో జరుగుతున్న పరిణామాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన తోట కిరణ్‌కుమార్ గత నవంబర్ 11న స్వయంగా కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. అయినా స్పందన లేకపోవడంతో సోమవారం ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేశాడు. ఆర్డీవో ఈ ఫిర్యాదును మరోసారి తహసీల్దార్‌కు పంపించారు. అయితే ఈ సర్వే నంబర్‌లో అదనంగా 1.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఏ విధంగా చేరిందో ప్రధానంగా విచారణ జరపాలని బొమ్మకల్ గ్రామస్తులు కోరుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అధికారులపై ఒత్తిడి చేసి ఈ విధంగా ప్రభుత్వ భూములను కాజేసేందుకు ఆది నుంచి ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, పట్టా భూమిలో అదనంగా చేర్చిన ప్రభుత్వ భూమిని తొలగించాలని కోరుతున్నారు.


Dharani
Land Records Management System
Land Details Search

సర్వే నంబర్ 58/ఎఫ్‌లో చేర్చిన అదనపు భూమిని చూపుతున్న పహాణీ

**కరీంనగర్‌ను ఆనుకొని ఉన్న బొమ్మకల్‌లో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములపై అక్రమార్కులు కన్నేశారు. దర్జాగా తమ భూమిలో కలిపేసుకుంటున్నారు. ఇప్పటికే అనేక జాగలను చెరబట్టిన భూ బకాసురులపై ప్రభుత్వం ఓ వైపు విచారణ చేస్తుండగానే, మరోవైపు ఆక్రమణలకు దిగుతున్నారు. పట్టా భూముల పక్కన ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. తమ జాగ కింద రాయించుకుంటున్నారు. అందుకు రాజీవ్‌రహదారికి నాలుగు అడుగుల దూరంలో 'సర్వే నంబర్ 58/ఎఫ్' ఉదాహరణగా నిలుస్తున్నది. 2017 వరకు అందులో 20 గుంటలే ఉంటే.. ఆ తర్వాత ఏకంగా ఆ 1.32 ఎకరాలకు మారడం కబ్జాలకు అద్దం పడుతున్నది. తాజాగా ఇదే సర్వే నంబర్ పక్కన ఉన్న గవర్నమెంట్ ల్యాండ్‌ను ఆక్రమించే పనిలో ఉన్నట్టు తెలుస్తున్నది. దీనిపై ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడం వల్లే ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నట్టు తెలుస్తుండగా, అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.**

కరీంనగర్, జనవరి 9 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ రూరల్: కరీంనగరాన్ని ఆనుకొని ఉన్న బొమ్మకల్‌లో భూములు కోట్ల విలువ జేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్నుపడగా, ఇప్పటికే అనేకం అన్యాక్రాంతమయ్యాయి. తాజాగా వెలుగు చూస్తున్న మరిన్ని సంఘటనలు విస్తు గొలుపుతున్నాయి. ప్రభుత్వ భూములను ఆనుకొని ఉన్న సర్వే నంబర్లలో అక్రమంగా విస్తీర్ణం పెంచి కబ్జా చేస్తుండగా, రికార్డుల మార్పులే కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే అనేక భూములు చేతులు మారుతుండగా, తాజాగా గ్రామస్తుల ఫిర్యాదుతో మరో ఆక్రమణ వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 58/ఎఫ్‌లో 1954-55 నుంచి కాస్రా పహాణీలో 20 గుంటల భూమి మాత్రమే ఉన్నది. దీనికి గతంలో నలుగురైదుగురి పేరిట పట్టా ఉన్నది. ఆ తర్వాత ఇద్దరు అన్నదమ్ముల పేరిట ఉండగా, గతంలోనే ఒక విద్యాసంస్థ అధినేతకు అమ్ముకున్నారు. అయితే 2017 వరకు ఆ సర్వే నంబర్‌లో కేవలం 20 గుంటలే ఉండగా, ఆ తర్వాత 1.32 ఎకరాలు చూపుతున్నది. అందులో 20 గుంటలు అసలు భూమి విద్యాసంస్థల అధినేత పేరిట ఉండగా, మిగతా 1.12 ఎకరాల భూమి బొమ్మకల్‌కు చెందిన ఓ నాయకుడి అనుచరుడి పేరిట చూపుతున్నదని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

### ప్రభుత్వ భూమిపై కన్ను

బొమ్మకల్‌లోని సర్వే నంబర్ 58/ఎఫ్‌లోని భూమి రాజీవ్ రహదారికి కొద్ది దూరంలోనే ఉంటుంది. దీనికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 28లో 9.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. అయితే పట్టా భూమి సర్వే నంబర్‌ను చూపి ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కొందరు ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగానే అధికారుల అండదండలతో 58/ఎఫ్‌లో లేని భూమిని చేర్పించినట్టు అర్థమవుతున్నది. సర్వే నంబర్ 28లోని ప్రభుత్వ భూమి ఇప్పటికే చాలా వరకు ఆక్రమణకు గురైంది. ఇప్పుడు ఇదేవిధంగా ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతున్నది. అయితే సర్వే నంబర్ 58/ఎఫ్‌లో కేవలం 20 గుంటలే ఉంటే.. అదనంగా 1.12 గుంటలు ఎలా చేరిందనేది? ఇప్పుడు చర్చకు వస్తున్నది. అది కూడా ఆన్‌లైన్‌లో నమోదు కావడం అంటే అధికారుల చేయి లేనిదే ఇది సాధ్యం కాదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. 2017 నుంచి 2019 వరకు ఉన్న తహసీల్ ఆఫీస్‌లో పనిచేసిన అధికారులు, ఉద్యోగుల ప్రమేయం ఉందని ఆరోపిస్తున్నారు.



వెంకటాపూర్ శివారులో ఎస్సారెస్పీ డీ-40 కాలువ దుస్థితి

# కాలువ ఇలా..? పంటలకు నీరందేదెలా..?

ఎస్సారెస్పీ కాలువలు రూపురేఖలు కోల్పోయాయి. ఎన్నోఏండ్లుగా రైతుకు భరోసా ఇచ్చి, సాగుకు ఆదరువుగా మారిన కెనాళ్లు ఇప్పుడు పూడికతో అధ్వానంగా మారిపోయాయి. అందుకు కోరుట్ల మండలంలో ఎనిమిది గ్రామాలకు నీరందించే వెంకటాపూర్ శివారులో ఎస్సారెస్పీ డీ-40 కెనాలే నిదర్శనంగా నిలుస్తున్నది. వందలాది ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ కెనాల్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ సీజన్‌లో సాగుకు నీరందే అవకాశమే లేకుండా పోగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు. **- కోరుట్ల రూరల్, జనవరి 9**

# బీఆర్‌ఎస్ నేతల నిర్బంధం

- కేటీఆర్ ఏసీబీ విచారణ నేపథ్యంలో ముందస్తు అరెస్ట్‌లు
- రేవంత్ సర్కారుపై గులాబీ శ్రేణుల ఆగ్రహం
- రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని ధ్వజం




హుజూరాబాద్ టౌన్: పోలీసుల అదుపులో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు

సిరిసిల్ల టౌన్/ జమ్మికుంట, జనవరి 9: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఆ పార్టీ నేతలపై నిర్బంధం కొనసాగింది. గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం నడిచింది. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ, అభివృద్ధి, హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని రేవంత్ సర్కారు ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు మొలుగు పూర్ణచందర్, ఇమ్రాన్, అనురాగ్, అమ్జదుల్లా ఖాన్, షేక్ అర్షద్‌ను అరెస్ట్ చేయగా, రేవంత్‌రెడ్డి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వీణవంకలో మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, నియోజకవర్గ యువనేత నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకులు అన్నారం శ్రీనివాస్, గుండ్లపల్లి పూర్ణచందర్, దార్ల సందీప్, సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తంగళ్లపల్లి మండలంలో పార్టీ మండలాధ్యడు గజభీంకార్ రాజన్న, నాయకులు నవీన్‌రావు, కొమురయ్య, వెంకటరంగంను అదుపులోకి తీసుకొని, సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.






జమ్మికుంట: హౌజ్ అరెస్టులో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వీణవంక: నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు



హైదరాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

# కక్షపూరితంగానే కేసులు

- హామీలు అమలు చేయలేకే కేటీఆర్‌పై దుష్ప్రచారం
- అన్నివర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తున్నది
- రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభావం తప్పదు
- బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, జనవరి 9: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని అక్రమ కేసులు బనాయిస్తున్నదని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన ఫార్ములా-ఈ కార్ రేస్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఆ యా దేశాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. మెక్సికోతో పాటు వేరే దేశంలో ఫార్ములా-ఈ కార్ రేస్ ఈ నెలలో జరుగుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఫార్ములా-ఈ కార్ రేస్ కేటీఆర్ చొరవతో 2023లో తెలంగాణలో జరిగిందని, నిబంధనల ప్రకా రం 2024లోనూ నిర్వహించాల్సి ఉండగా, కక్షపూరితంగా రేవంత్‌రెడ్డి నిలిపివేశారన్నారు. డబ్బు సంచులతో దొరికిన రేవంత్‌రెడ్డి.. కేటీఆర్‌పై అక్కసుతో అక్రమంగా ఏసీబీ కేసు పెట్టించాడని ఆరోపించారు. దురుద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేయాలన్న ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ఘోర పరాభావం తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, అబద్ధపు హామీలతో రేవంత్‌రెడ్డి అందలం ఎక్కాడన్నారు. రైతుభరోసా, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్, ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని కేటీఆర్ చేస్తున్న డిమాండ్లను ఎదుర్కొనలేక అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన నిలువబోవన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కోడి అంతయ్య, అందె సుభాష్, అక్కరాజు శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, కుంబాల మల్లారెడ్డి, అబ్బడి అనిల్, మాట్ల మధు, కొమ్ము బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్‌లో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

జగిత్యాల రూరల్, జనవరి 9: అర్హత, నైపుణ్యమున్న స్కిల్డ్ కార్మికులకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్ కామ్ కార్మిక, ఉపాధి శిక్షణ, కార్మాగారాల శాఖ కింద సింగపూర్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నదని జగిత్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగపూర్‌లో మేషన్, స్టీల్ ఫిక్సర్‌ల కోసం ఖాళీలు ఉన్నాయని తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉండి, 25 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు, సింగాపూర్ వెళ్లొచ్చిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లలో (9440049 861, 9440051452) సంప్రదించాలని సూచించారు.




కొదురుపాకలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

# అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకునేదెన్నడో?

సుల్తానాబాద్ రూరల్, జనవరి 9: సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ₹12.50లక్షల నిధులతో నూతన భవన నిర్మాణం చేపట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవనం పూర్తయింది. 2023 డిసెంబర్ 31న పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అయితే కొద్ది రోజులుగా ఆయా లేకుండానే సదరు ఆ కేంద్రాన్ని నడిపించారు. కానీ, ఏడు నెలల (జూలై 2024) క్రితం అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగ విరమణ చేయగా, అప్పటి నుంచి టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయలేదు. దాంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవడం లేదు. పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు.. చిన్నారుల విద్యాభ్యాసం కోసం వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సీడీపీవో కవితను సంప్రదించగా, కొంతకాలం నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. గ్రామానికి ఇన్‌చార్జి సూపర్‌వైజర్ వారానికోసారి వస్తున్నదని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు.

